ప్రజాశక్తి

శుక్రవారం 19 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అక్రమ కట్టడాల జోరు

55వ వార్డులోని అక్రమ నిర్మాణం

- నిబంధనలు బేఖాతరు
- జోన్-5లో పట్టించుకోని జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/సీతమ్మధార

మహా విశాఖ నగర పాలక సంస్థలో అక్రమ కట్టడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. కళ్లెదుటే అనుమతి లేని భవనాలు ఆకాశహర్మ్యాలుగా మారుతున్నా కళ్లుండీ చూడలేని స్థితిలో పలుచోట్ల జోనల్ స్థాయి మున్సిపల్ యంత్రాంగం ఉంది. జివిఎంసి జోన్-5 ఈ అక్రమ కట్టడాలకు ఆలవాలంగా మారిపోయింది. ఇప్పటికే జోన్ - 2లో భూ ఆక్రమణల పర్వం పెద్ద ఎత్తున కొనసాగుతోంది. గెడ్డలు, చెరువులు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో భవనాలు వెలుస్తున్నాయి. జోన్ - 5లో ఐదారు అంతస్తుల భవనాలు అనుమతుల్లేకపోయినా జివిఎంసి స్థానిక అధికారుల కనుసైగలతో నడిచిపోతున్నాయి. టిడిఆర్‌లు లేనివి ఉన్నట్లు భవనాలు, స్థలాలకు చూపించుకుంటూ రూ.లక్షల్లో అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారి పాత్ర ఈ జోన్‌లో ఉన్నట్టు కనిపిస్తోంది. గతంలో అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్‌లో విధులు నిర్వహించిన టిపిఒ విజయ్‌కుమార్‌పై జోన్ 5లో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జివిఎంసి వారం వారం నిర్వహించే మిగతా 2లో..

పరిశీలించి చర్యలు తీసుకుంటాం : ఎసిపి రామకృష్ణ

ఎక్కడెక్కడ అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నాయో కింది స్థాయి అధికారులకు తెలుస్తుందని, తమ దృష్టికొస్తే పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని జోన్ 5 ఎసిపి రామకృష్ణ 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. జోన్ - 5 పరిధిలో చోటుచేసుకున్న అక్రమ నిర్మాణాలను, టిపిఒపై వస్తున్న ఆరోపణలను ఆయన వద్ద గురువారం ప్రస్తావించగా పై విధంగా స్పందించారు.

43వ వార్డులోని అక్రమ కట్టడం

గుడ్డు ధర గుబేల్

- బహిరంగ మార్కెట్‌లో ఒకటి రూ.7
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రుచికరమైన.. సురక్షితమైన, పోషకాలన్నీ సమృద్ధిగా ఉన్న, చవకైన.. చిటుక్కున వండుకోవడానికి వీలైన, అన్ని కాలాల్లో దొరికే.. అన్ని వయసుల వారికీ నచ్చే ఆరోగ్యకరమైన ఆహార పదార్థం గుడ్డు మాత్రమే. అటువంటి గుడ్డు ధర నేడు గుబేల్‌మనిపించేలా పెరిగింది. విశాఖ నగరంలో చిల్లరగా ఒక గుడ్డు ధర రూ.7గా ఉంది. రైతు బజార్లలో డజను గుడ్ల ధర రూ.80గా ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.84గా ఉంది. గత వారాంతానికి 100 గుడ్ల ధర రూ.500గా ఉండగా ఈ వారాంతానికి రూ.550కి చేరింది. రానున్న రోజుల్లో గుడ్ల ధర మరింత పెరిగే వీలుందని రిటైల్ వర్తకులు అంటున్నారు.

ఎందుకిలా..

ఉత్తర ఈశాన్య రాష్ట్రాలలో చలి తీవ్రత పెరిగింది. దీంతో ఆ రాష్ట్రాల్లో గుడ్ల వినియోగం పెరిగింది. కొల్‌కతాలోని హోల్‌సేల్ డీలర్లు గుడ్లను భారీగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం కోస్తాంధ్ర నుంచి ఈశాన్య రాష్ట్రాలకు రోజుకు 150 ట్రక్కుల మేర గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. ఈ సీజన్‌లో గుడ్ల ధర పెరగడం సర్వసాధారణం. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రోజుకు 40 లక్షల వరకు గుడ్ల ఉత్పత్తి ఉంటుంది. డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుపాను కారణంగా శ్రీకాకుళం జిల్లాలో పౌల్ట్రీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ జిల్లా నుంచి గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ కారణంతో ఉత్తరాంధ్రలో ఇప్పుడు 20 లక్షల నుంచి 25 లక్షల గుడ్ల ఉత్పత్తి రోజుకు జరుగుతుంది. ఉత్పత్తిలో 80 శాతం స్థానిక వినియోగానికిపోగా 20 శాతం మాత్రమే ఉత్తరాంధ్ర నుంచి కొల్‌కతాకు గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ధరలే మరికొన్ని వారాలు కొనసాగే వీలుందని వ్యాపారులు అంటున్నారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడు మృతి

వార్త 3లో..

లారీ డ్రైవర్ల సమస్యలపై హైవే దిగ్బంధం

వార్త 3లో..

షోకాజ్ నోటీసులపై నిరసనలు

వార్త 8లో..

పోలీసాధికారులతో రాజీవ్ కుమార్ మీనా

22 నుంచి విశాఖలో పోలీస్ కమాండో పోటీలు

దేశ నలుమూలల నుంచీ జట్లు రాక

వార్త మెయిన్‌లో..

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన

రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న శ్యామలరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత లోపించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, పక్కా జాబితాను రూపొందించి ప్రచురించాలని ఓటర్ల జాబితా పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు జిల్లా అధికారులను ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పులు దొర్లకుండా జాబితాను రూపొందించాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, ఇఆర్ఒలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియపై సమీక్షించారు. పక్కా జాబితాను రూపొందించేందుకు అనుసరించే విధానాలపై దిశానిర్దేశం చేశారు. సమీక్షలో భాగంగా నియోజకవర్గాల వారీగా జాబితాలను పరిశీలిస్తూ ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని జనాభా, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల నిష్పత్తి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోట ఐదుకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలను అడుగుతూ భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫైనల్ జాబితా ప్రచురణ కాపీలను రాజకీయ పార్టీల జిల్లా ప్రెసిడెంట్ లేదా సెక్రటరీలకు అందజేయాలని చెప్పారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. సెలక్టోరల్ అధికారుల నియామకం, రిపోర్టింగ్ అథారిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలని ఇఆర్ఒలను ఆదేశించారు. అందరూ సమన్వయం వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ ఓటర్ల జాబితా పరిశీలకులకు వివరించారు. ఈ నెల 22న ఫైనల్ లిస్టు ప్రచురించనున్న మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన

నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులకు నిర్ణీత కాలంలో పరిష్కారం చూపామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఇఆర్ఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, లక్ష్మారెడ్డి, మూర్తి, శేష శైలజ, అఖిల, ఎన్నికల సెల్ అధికారులు, డిటిలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల జోరు

గ్రీవెన్స్‌లోనూ టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలపై ఈ జోన్ నుంచి వినతులుంటున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. విశాఖ జోన్ 5లో గతంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి టిపిఒగా ప్రమోషన్‌తో ఇక్కడే తిష్టవేసి అనధికారిక నిర్మాణాలను ప్రోత్సహిస్తూ, జివిఎంసి ఆదాయానికి రూ.లక్షల్లో గండికొడుతూ విజయ్‌కుమార్ తన పబ్బం గడుపుకుంటున్నారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.

అక్రమాలకు అడ్డాగా జోన్ -5లో పలు వార్డులు

జోన్ 5 పరిధిలోగల 55వ వార్డు తాటిచెట్లపాలెం డోర్ నెంబరు 44-7-25, 43వ వార్డు రామచంద్రనగర్ డోర్ నెంబరు 44-40-2, 43వ వార్డు రామచంద్రనగర్ డోర్ నెంబరు 45-43-26, 44వ వార్డు అలాగే పుట్ట బంగారమ్మ గుడి పక్కన 100 గజాల్లో జి - ప్లస్ 4 అనధికారిక నిర్మాణం జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించడం కనిపిస్తోంది. 42వ వార్డు రైల్వే న్యూ కాలనీ జివిఎంసి ప్రైమరీ స్కూల్ ఎదురుగా డోర్ నెంబరు 44-24-23/1 వద్ద అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పట్ల స్థానికులు నివ్వెరపోతున్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీల వేతనాలు వెంటనే పెంచాలని, ఇతర డిమాండ్లనూ నెరవేర్చాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తదితర కార్మిక సంఘాలు గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీల జీతాలు పెంచుతూ ప్రభుత్వం జిఒ ఇవ్వాలని, లేనిపక్షంలో వారికి మద్దతుగా అఖిలపక్ష కార్మిక సంఘాలు నిలబడతాయని అన్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ రాస్తారోకోలు నిర్వహించనున్నామన్నారు. 'జగనన్నకి చెబుదాం' అని 'కోటి సంతకాలు'ను ప్రజల వద్ద నుంచి సేకరిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో రాష్ట్ర బంద్ నిర్వహిస్తామన్నారు. నిర్బంధం ద్వారా ప్రభుత్వం ఉద్యమాలను అణగదొక్కాలనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు బి.జగన్, వి.కృష్ణారావు, ఎఐటియుసి నాయకులు ఎం.మన్మధరావు, పడాల రమణ పాల్గొన్నారు.

ఎయు విసి ప్రసాద్‌రెడ్డిని తొలగించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి కార్యకర్తలా వ్యవహరిస్తున్న పివిజిడి ప్రసాద్‌రెడ్డిని తిరిగి ఎయు విసిగా నియమించడం దారుణమని, తక్షణం ఆయన్ని తొలగించాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం ఎయు మెయిన్ గేట్ ఎదురుగా వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీ చరిత్రను, పరువును తుంగలో తొక్కుతూ అధికార పార్టీ కార్యక్రమాలకు అడ్డాగా ఆంధ్ర యూనివర్సిటీని ప్రసాద్‌రెడ్డి మార్చివేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్చూరు రాజేంద్రబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రజాశక్తి కేలండర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బ్యూరో చీఫ్ ఎన్.మధుసూదనరావు, ఎడివిటి ఇన్‌ఛార్జి ఎస్.రాజేష్ రెడ్డి, ప్రతినిధి దేముడుబాబు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరమైతే, విశాఖ తన ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉన్నందున విశాఖ ఉక్కును అందరం సమిష్టిగా పరిరక్షించుకుందామని ఒబిసి అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు మొహిద్దీన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం 1071వ రోజు రిలే నిరాహార దీక్షలలో ఒబిసి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆర్‌కె బీచ్‌లోని ఆయన విగ్రహానికి ఆ పార్టీ ముఖ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టిడిపి జిల్లా కార్యాలయం ఆవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో తెలుగు తమ్ముళ్లు రక్తదానం చేశారు. పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబుతో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు పాసి నరసింగరావు, డిఎఎన్.రాజు, సరగడ అప్పారావు, వానపల్లి సత్య, జోగ సన్యాసిరావు, కొక్కిరి అప్పన్న, వి.పోతురాజు, కనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు చిన్న బజారు జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు నివాళు లర్పించారు

ములగాడ : జివిఎంసి 62 వార్డు పరిధి దుర్గానగర్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జి సోమేష్, కోరుబిల్లి రాము, డొప్ప సన్యాసిరావు పాల్గొన్నారు. యారాడలో టిడిపి నాయకులు పిల్ల అచ్చారావు, చిట్టి ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ నిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు పూల మాల వేసి నివాళు లర్పించారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు అధ్యక్షులు మొక్క కిషోర్‌కుమార్ ఆధ్వర్యాన సంఘమాస్ వద్దగల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : పెదగంట్యాడలో నేషనల్ టిఎన్‌టియుసి జనరల్ సెక్రటరీ బొడ్డు పైడిరాజు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్టీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెంలో మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తారక్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి వార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొల్లంగి ఆనందబాబు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో మాట్లాడుతున్న మజ్జి మాలినాయుడు

గోపాలపట్నం : గోపాలపట్నం బిఆర్‌టిఎస్ రోడ్డులో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. 89వ వార్డులో కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 92వ వార్డు పద్మనాభనగర్‌లో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి నందవరపు సోములు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి కోరాడ రమణ ఆధ్వర్యాన పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో ఎన్టీఆర్ భారీ విగ్రహానికి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. వెంకుపాలెం, బౌలువాడ పంచాయతీ దర్జీ నగర్, తుమ్మపాలలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలతో నివాళులర్పించారు. మెయిన్ రోడ్డు ఎన్టీఆర్ జంక్షన్ ఎన్‌టిఆర్ విగ్రహం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నాయకులు పరుచూరి భాస్కరరావు నివాళులర్పించారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు వారధి అప్పారావు నివాళులర్పించారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జి పివిజి.కుమార్, నాయకులు పైల ప్రసాదరావు పూలమాలవేసి నివాళులర్పించారు.

కశింకోట : కశింకోట జంక్షన్‌లో ఎన్టీఆర్- బసవతారకం విగ్రహాలకు ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి నాయకులు దాడి రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు, రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, కోట్ని బాలాజీ, ఉగ్గిన రమణ మూర్తి, పెంటకోట రాము పాల్గొన్నారు. తీడ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఎన్‌టిఆర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

మునగపాక : స్థానిక మెయిన్ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నియోజకవర్గం ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి మంజు, జనసేన నాయకులు టెక్కలి పరుశు రాం, దాడి ముసలి నాయుడు,

సబ్బవరం : స్థానిక ఎన్టీఆర్ జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇరువాడ పంచాయితీ శివారు గణపతి నగర్‌లో రేసుపూడి రమణ నివాళులర్పించారు.

పరవాడ : సంత బయలు వద్ద ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి నివాళు లర్పించారు. రావాడ ఎన్టీఆర్ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా నివాళులర్పించారు.

బుచ్చయ్యపేట : దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు, నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసిలు గోన్నాబత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: బోడపాలెం శివారు కొత్తూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చింతకాయల విజయ్, రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నాయుడు, జానకి శ్రీను, వేచలపు జనార్ధన్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:వేములపూడి పంచాయతీ పెద్ద ఉప్పరగూడెంలో మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నక్కపల్లి: కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

చీడికాడ: మండల కేంద్రంలో మాజీ జడ్పిటిసి పోతల రమణమ్మ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు.

గొలుగొండ : అడిగర్ల అప్పల నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎఎల్‌పురం మేజర్ పంచాయతీలో మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల, సిహెచ్ నాగపురంలో మాజీ సర్పంచ్ కొలగాని రామారావు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE cum XIV ADDL. METROPOLITAN MAGISTRATE AT: BHEEMUNIPATNAM O.S. 408/2022

Between:
Gantakoru Sanyasi Rao ...Plaintiff
And:
Gantakoru Paidamma & 10 others ...Defendants

SUMMONS

To,
D-10: Pala Kanaka Durga, W/o. Venkata Rao, Hindu, aged 48 years, R/at D.No.58-29-13/1, Kakani Nagar, Vinod Nagar, N.A.D. Kotha Road, Visakhapatnam.
D-11: Pilla Venkata Ramana Kumari, W/o. Nageswara Rao, Hindu, aged 58 years, R/at D.No.55-14-64, A.P.S.E.B. Colony, Seethammadhara, Visakhapatnam.

Please take notice that the above-named plaintiff has instituted the above suit against you and other defendants for partition of the plaint schedule property and the matter stands posted to **21-03-2024** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **21-03-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
NAMBURI SRINIVASA GANGADHARAM,
Advocate, Visakhapatnam,
Cell: 9666658544.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM E.P.18/2021 in O.S.71/2017

Between:
Smt. Simhadri Seetharatnam ...D.Hr/Plaintiff
And:
Patnala Appalachari and others ....J.Drs/Defendants

NOTICE

To,
J.Dr No.1: Patnala Appalachari, S/o.late Gurumurthy, Hindu, aged about 65 years, R/at Kapuluppada Village, Bheemunipatnam Mandal, Visakhapatnam
J.Dr No.2: Patnala Nagaratnam, W/o.Appalachari, Hindu, aged about 60 years, Rest-do-
J.Dr No.3: Patnala Nagendra Rao, S/o. Appalachari, Hindu, aged about 41 years, Rest-do-
J.Dr No.4: Patnala Kamalakar, S/o. Appalachari, Hindu, aged about 33 years, Rest-do-

Please take notice that the above named D.Hr/plaintiff has instituted the above E.P.18/2021 in O.S.71/2017 against you and the matter stands posted to **25-01-2024** for your appearance. Therefore you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **25-01-2024** at **10:30 A.M** to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
P. RAMA RAO,
P.S. RAVI CHANDRA RAO
Advocates,
Visakhapatnam.

మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో IA 159/2021 in OS 95/2021

Between:
గవిడి దేవి W/o సూరిబాబు, R/of ముచ్చర్ల విలేజ్, గజపతినగరం మండలం, విజయనగరం డిస్ట్రిక్ట్.
....పిటీషనరు/వాది
And:
గవిడి ఆదిలక్ష్మి మరియు ఇతరులు
....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

నోటీసు

To
(R3) గవిడి సూర్యనారాయణ S/o Late రాములు, R/of డోరు నెం-18-2-06, కోరమాండల్ గేటు, Ex సర్వీసు మెన్ కోలనీ, గ్రేటర్ విశాఖపట్టణం.

పైన పేర్కొన్న పిటీషనరు మీపై పర్మనెంటు ఇంజక్షను దావా వేసి ఉన్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం **తే 09-02-2024ది**న వాయిదా అయి ఉన్నది. కనుక **ఆ దినమున ఉదయం గం॥ 10-30 ని॥**లకు స్వయంగా కాని లేక వకీలు ద్వారా కాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయవలయును, లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

ఇట్లు
బెల్లాన రవి
అడ్వకేటు,
విజయనగరం

సమస్యలను పరిష్కరించాలి

పద్మనాభం మండల సమావేశంలో ముత్తంశెట్టి

పద్మనాభం మండల సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాంబాబు అధ్యక్షతన గురువారం ఏర్పాటుచేసిన మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మండల వ్యవసాయ శాఖాధికారి ఎంవి చలాన్ తన విభాగానికి సంబంధించి వివరాలను సభ్యులకు వివరించారు. ఇప్పటివరకు రైతుల నుంచి 3000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. వైద్యశాఖ అధికారి కె.కళావతి మాట్లాడుతూ ప్రతి నెలా మండల స్థాయిలో నాలుగు వైద్య క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమయంలో రేవిడి ఎంపిటిసి సభ్యులు షేర్ సూరప్పుడు లేచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదని, నిరుపేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఎంపిపి స్పందించి నెలలో ఒక తేదీని నిర్ణయించి, 20 మందిని ఏర్పాటుచేసుకొని శస్త్రచికిత్సలు చేయాలని ఆదేశించారు. పశువైద్యాధికారి ఆర్.శ్రీనివాసరావు తమ విభాగ వివరాలను వెల్లడించారు. ఐసిడిఎస్ ఎసిడిపి ఒ.సుజాత, ఉపాధి హామీ పథకం ఎపిఒ వరలక్ష్మి ఆయా విభాగాల పనుల గురించి వివరించారు. మండల ఇంజినీరింగ్ అధికారి జగదీష్ మాట్లాడుతూ, మండలంలోని 22 పంచాయతీల్లో 16 సచివాలయాలు మంజూరయ్యాయని, వాటిలో 13 నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు ఏ స్థాయిలో నిర్మాణ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఏడు ఆర్‌బికెలు, ఐదు వెల్‌నెస్ సెంటర్లు పూర్తయ్యాయని వివరించారు. ఈ సమయంలో గన్నవరం సర్పంచ్ జివికె.వర్మరాజు లేచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై చేపట్టిన పనులకు బిల్లులు కాలేదని తెలిపారు. అదే సమయంలో బితాలవలస సర్పంచ్ చండక శ్రీను లేచి రూ.15 లక్షలు బిల్లు రాకపోవడంతో మిగిలిన పనులు చేయలేకపోతున్నామని సభకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ బిల్లులపై అధికారులను నిలదీశారు. రోడ్లు భవనాల శాఖ సమీక్షలో రేవిడి- అయినాడ ఆర్ అండ్ బి రోడ్డు పనులు చేయలేదని బీతాలవలస సర్పంచ్ చండక శ్రీను, రేవిడి ఎంపిటిసి సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. జగనన్న ఇళ్ల కాలనీలో 70 శాతం పనులు పూర్తయిన చోట ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఒ కె.ప్రభాకరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు లక్ష్మణరావు, వైస్ ఎంపిపి ఈర్ల రాజేశ్వరి, తహశీల్దార్ వేణుగోపాల్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల సమస్యలపై హైవే దిగ్బంధం

ప్రజాశక్తి -ఆనందపురం : దేశవ్యాప్తంగా లారీ డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జిఒ 106(2) వెంటనే రద్దుచేయాలని కోరుతూ గురువారం ఆనందపురం హైవే బ్రిడ్జిపై డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గండ్రెటి సూర్యనారాయణ, పూడి అప్పారావు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ మూలమని, లారీ డ్రైవర్లకు ఇన్సూరెన్స్, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలా కాకుండా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఏడు లక్షలు అపరాధ రుసుము చెల్లించాలనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగేటప్పుడు డ్రైవర్లను బాధ్యులు చేయడం సరికాదన్నారు. ఆనందపురం మండలం లారీ యూనియన్ అసోసియేషన్ నాయకులు పైడినాయుడు, కిలాని శ్రీను, అప్పలనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం హైవేపై ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

శంకుస్థాపన చేస్తున్న హేమలత

బోరు ఏర్పాటు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదో వార్డు పరిధి మారికవలస ఒజోన్ వేలి కాలనీలో బోరు బావి ఏర్పాటుకు కార్పొరేటర్ మొల్లి హేమలత గురువారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ బోరు ఏర్పాటు ద్వారా కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. తాగునీటి బోరు మరమ్మతులకు గురై ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో జివిఎంసి నీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి పరిశీలించినట్లు ఆమె చెప్పారు. ఈ విషయాన్ని మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో కొత్త బోరు మంజూరు చేశారని తెలిపారు. వార్డులో కొన్ని చోట్ల తాగునీటి సమస్యను గుర్తించి బోర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కాలనీ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలతో బెంబేలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆనందపురం శ్రమజీవుల కాలనీలో వరుస దొంగతనాలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కాలనీలోకి వచ్చి కోళ్ల దొంగతనాలు చేస్తూ పరారవుతున్నారు. మెలకువ వచ్చి లేచేసరికి కోళ్లు పట్టుకొని పారిపోతూ సుదూరంలో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పారిపోతున్నారని బాధితులు తెలుపుతున్నారు. ఆనందపురం భూలోకమాత గుడి కాలనీలో అంగటి అప్పారావు ఇంటి వద్ద కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి పట్టుకొని పారిపోయారు. ఇటీవల మూడుసార్లు కోళ్ల దొంగతనం జరిగినా దొంగలు దొరక లేదు. ఈ మేరకు బాధితుడు అంగటి అప్పారావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి బొట్టవానిపాలెం శివారులో బివిపి యువత ఆధ్వర్యాన గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కీర్తిశేషులు కొర్రాయి గోవిందరావు మెమోరియల్ బొట్టవానిపాలెం (బివిపి) ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నేటితో ముగిశాయి. హోరాహోరీగా తలపడిన 5 జట్లలో రెండు జట్లు ఫైనల్‌కు చేరుకోగా విజేతగా బివిపి హంటర్స్, బివిపి గేమ్ చేంజర్ రన్నర్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లకు రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, గ్రామ పెద్దలు కలిసి ట్రోఫీలను, నగదు బహుమతిని అందించారు. అనంతరం మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రతి సంక్రాంతికి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా చక్కగా చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం టిడిపి బిసి సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, ఈగల రవికుమార్, నమ్మి సూర్యఅప్పారావు, కొర్రాయి మంగరాజు, ముగడ రమణ, మేడబోయిన సూర్య, బొట్ట అప్పారావు, దాసరి గోవింద్, కొర్రాయి సురేష్, ఇమంది అప్పలరాజు, దాసరి నాయుడు, సురేష్, బొట్ట అప్పలరాజు, బొట్ట కనకరాజు, నమ్మి చినరమణ, మేడబోయిన కల్యాణ్, వానపల్లి శ్రీను, అబి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేటకు చెందిన జి.లక్ష్మణరావు ఆకస్మిక మృతితో అతని భార్య అమ్మాజీకి వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సహాయంగా రూ.10 వేలను వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అమ్మాజీకి బీమా సాయం అందిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -గాజువాక : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గాజువాక పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. గాజువాకకు చెందిన మద్దురాజు (36) తహశీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న రోడ్డు దాటుతుండగా శ్రీనగర్ నుంచి గాజువాక వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గాజువాకకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బొడ్డపాలెం గ్రామం హార్వర్ స్కూల్ వెనక కడుతున్న బిల్డింగ్ సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడు మృతి చెందాడు. మధురవాడ వాంబే కాలనీ నాలుగో బ్లాకు ఫ్లాట్ ఎఫ్‌కు చెందిన చిప్పాడ పార్వతి కుమారుడు కౌశిక్ ఈషా (7)ను తీసుకొని బొడ్డపాలెంలోని కన్నవారి ఇంటికి సంక్రాంతి పండగకు వచ్చారు. కుమారుడు కౌశిక్ డమ్మీ తుపాకీతో ఆడుకుంటుండగా అది ట్యాంకులో పడిపోయింది. ఆ తుపాకీని తీసుకునే ప్రయత్నంలో కౌశిక్ ట్యాంకులో పడి మునిగిపోయాడు. కౌశిక్ కనిపించకపోవడంతో తల్లి పార్వతి అన్ని చోట్లా వెతికింది. సెప్టిక్ ట్యాంక్‌లో పడిపోయినట్లు గుర్తించి బయటకు తీశారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుని తండ్రి ఇదివరకే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై వ్యాన్ దగ్ధం

ప్రజాశక్తి - అరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డులో చినగదిలి సమీపంలో కొత్తగా నిర్మించిన నారాయణ ఆసుపత్రి వద్ద సర్వీసు రోడ్డులో నిలిపి ఉన్న వ్యాన్ గురువారం దగ్ధమైంది. సర్వీసు రోడ్డులో సుమారు ఏడాదిగా నిలిపి ఉన్న ఈ వ్యాన్ దగ్గర గురువారం చిన్నపిల్లలు ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పు తగలడంతో ఒక్కసారిగా వ్యాన్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి -కశింకోట: కశింకోటలోని గోవిందరావు కాలనీకి చెందిన సూరిశెట్టి ఉమ మహేశ్వరరావు (31) అనే యువకుడు కనబడటం లేదని కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 17న ఉదయం అనకాపల్లిలో బట్టల షాపులో పనికి వెళ్లాడని, తిరిగి ఇంటికి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సిఐ వినోద్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సబ్బవరం : మండలంలోని అమతపురం గ్రామంలో పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సి.ఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక ఎస్సై సత్యనారాయణ తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి అమృతపురం గ్రామానికి చెందిన పట్నాల శంకరరావు, పట్నాల నాగరాజు, పితాని ఈశ్వరరావు, ఎద్దుమట్ల వెంకటరమణ, కర్రి దేముడు బాబులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

కోటవురట్ల: మండలంలోని ఎండపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు నిందితులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4400 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనునట్లు ఎస్సై రమణయ్య తెలిపారు.

కోడి పందాల శిబిరాలపై దాడి

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో కోడిపందేల శిబిరాలపై స్థానిక ఎస్సై డి.లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. అక్కడ కోడి పందాలాడుతున్న నలుగురిని అరెస్టు చేశారు. సిఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు ప్రకారం... గుల్లేపల్లిలో పందాలాడుతున్న దాసరి గౌరీసు (29), దాకమర్రి సత్తిబాబు (34)ను అరెస్టు చేసి వారి వద్దనున్న రెండు కోడిపుంజులను, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొగలిపురంలో పందాలాడుతున్న గుల్లేపల్లికి చెందిన దార పోలిపల్లి (40), మొగలిపురానికి చెందిన బత్తిన పట్టాభి మణికంఠ (24)ను పట్టుకొని వారి వద్దనున్న రెండు కోడిపుంజులను, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

లక్ష్మణమూర్తిని సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారులు

చిత్రలేఖనంతో సృజనాత్మకత

ప్రజాశక్తి - ములగాడ : చిత్రలేఖనం సృజనాత్మకతను పెంచుతుందని ప్రముఖ చిత్రకారుడు మంథ లక్ష్మణమూర్తి అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో చిత్రకళా పరిషత్ ఆధ్వర్యాన నిర్వహించిన చిత్రలేఖన వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చిత్రలేఖనం ఒత్తిడిని తగ్గిస్తుందని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, పేరు ప్రఖ్యాతులను తెస్తుందని తెలిపారు. ప్రతి చిత్రకారుడు సొంతంగా చిత్రాలను వేయాలని కోరారు. చిత్రకారుడు, పాత్రికేయుడు సుంకర చలపతిరావు మాట్లాడుతూ, లక్ష్మణమూర్తి అనేక దేశాలలోని ఆర్ట్ ఎగ్జిబిషన్స్ తిలకించారని, చిత్రాలను అంతర్జాతీయ పోటీలకు పంపి అవార్డులు గెలుచుకున్నారని తెలిపారు. ప్రకృతి దృశ్యాలను చిత్రాలుగా వేయడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. అనంతరం లక్ష్మణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు జిఎస్.రాజు, సిఎస్ఎన్.రాజు, మనోహర్, శివ, సురేష్, వెంకటరమణ, వంశీ, శంకర్, సూర్యనారాయణ, పాత్రికేయులు, రచయితలు రామారావు, కె.నరసింహం, కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజయ్ కుమార్, లక్ష్మణమూర్తి కుటుంబ సభ్యులు సత్యవతి, సూర్యకాంతం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24న మార్కెట్లు, షాపులకు వేలం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి జోన్-8 పరిధిలోని మార్కెట్లు, షాపుల నిర్వహణకు ఈ నెల 24వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదలచేశారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జివిఎంసి మార్కెట్లకు, మూడేళ్ల కాలానికి షాపు రూములను గుత్తకిచ్చుటకు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు వేపగుంటలోని జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు దరావత్తును జివిఎంసి కమిషనర్ పేరున డీడీ తీయాలని, ఆధార్, పాన్ కార్డులను సమర్పించాలని తెలిపారు. మిరిన్ని వివరాలకు జోన్-8 కార్యాలయం పర్యవేక్షకులను పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో దివీస్ ప్రతినిధులు

73 మందికి ఉపకార వేతనాలు

ప్రజాశక్తి -తగరపువలస : 2022-23 విద్యా సంవత్సరంలో మార్కులు ఆధారంగా 8వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 73 మంది విద్యార్థులకు భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన గురువారం సుమారు రూ.4లక్షలా 39 వేలు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో దివీస్ ఉపాధ్యక్షులు ఎస్.దేవేందర్, ఎల్‌వి.రమణ ద్వారా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్.కోటేశ్వరరావు, ఎంఎస్ఎన్.రావు, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్, బిందు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉపకార వేతనాలు పొందిన వారిలో మండలంలోని చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, మూలకుద్దు, అన్నవరం, టి.నగరపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.

క్షతగాత్రుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, తీవ్ర గాయాలతో చికిత్స పొంది ఇంటి వద్దనే మంచం పట్టిన విజయనగరం జిల్లా, భోగాపురం ప్రాంతానికి చెందిన ఎస్.హేమంత్ (23) కుటుంబానికి స్థానిక కలిగొట్ల స్పిర్లదేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి గురువారం రూ.10 వేలు చెక్కు అందజేశారు. ఈ మేరకు అతని తల్లి కొండమ్మకు స్థానిక ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీనుతో దళిత నేతల ములాఖత్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడిచేశాడని ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్ ఖైదీగా విశాఖ కేంద్రకారాగారంలో ఉంటున్న జనిపల్లి శ్రీనివాస్‌ను దళిత నేతలు గురువారం కలిశారు. తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కేంద్రకారాగారంలో జనిపల్లి శ్రీనివాస్ నిరసన చేపడుతున్నాడన్న సమాచారంతో విదసం ఐక్య వేదిక నేతలు గురువారం ఆయనను కలిసి నిరసనకు సంఘీభావం తెలిపినట్లు విదసం ఐక్య వేదిక నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

జైలు బయట సంఘీబావం తెలుపుతున్న విదసం ఐక్య వేదిక నాయకులు

జైలు బయట సంఘీభావం

కేంద్రకారాగారంలో శ్రీనివాస్ నిరవధిక దీక్ష చేస్తున్నాడన్న సమాచారంతో ఆయనకు మద్దతుగా విదసం ఐక్య వేదిక నేతలు గురువారం కేంద్రకారాగారం బయట సంఘీభావం తెలిపారు. కోడికత్తి కేసులో జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరవ్వాలని, దళిత యువకుడు శ్రీనివాస్‌పై ప్రభుత్వం వివక్ష నశించాలని ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, కోడి కత్తి కేసులో న్యాయం కోసం శ్రీనివాసరావు గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. ఈ నిరసనలో విదసం నాయకులు ఎస్ఆర్.వేమన, సుధాకర్, హరిబాబు, బూల భాస్కరరావు, శామ్యూల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి పరిధిలో 100 గజాలుపైబడిన అభ్యంతరం లేని ఆక్రమణ భూములకు, సొంతింటి స్థలాలకు చట్టపరమైన హక్కులను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జిఒ 388 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను ఆయా లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అందించారు. జివిఎంసి 52వ వార్డు పరిధి శాంతినగర్ సామాజిక భవనంలో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, పట్టాలు అందుకున్న వారికి ఇకపై వారి నివాసంపై సర్వ హక్కులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్ జయ, వైసిపి నాయకులు బెహరా భాస్కరరావు, బిఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో 22ఎ లో భూమిలో ఉన్న అర్హులకు ఇళ్ల పట్టాలను అందించినట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు చెప్పారు. అక్కయపాలెంలోని షాదీ కనేకల్ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా 22ఎ లో ఉన్న భూములను అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అందజేశారని తెలిపారు. మొత్తం 358 మందికి ఇంటి పట్టాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనిల్ కుమార్ రాజు, శశికళ, సాడి పద్మారెడ్డి, బర్కత్ ఆలీ, చల్ల రజని, అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత అమర్‌నాథ్‌కు లేదు'

ప్రజాశక్తి-పెందుర్తి : కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు లేదని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు వేగి దివాకర్ అన్నారు. తన స్వగృహంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, గుడివాడ అమర్‌నాథ్ తండ్రి ఏ పార్టీ నుంచి పోటీ చేశారో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఎప్పటికీ చెక్కు చెదరని పార్టీ అన్నారు. షర్మిల పార్టీలో చేరిన తర్వాత నూతనోత్సాహంతో పాటు పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కూడా పోటీలో ఉంటుందని అమర్‌నాథ్ గుర్తుంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని అమర్‌నాథ్‌ను ప్రశ్నించారు.

నరసింహనగర్‌లో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి నరసింహనగర్‌లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనూక్ మాట్లాడుతూ, జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇంటి వద్దకే ఆరోగ్య కార్యక్రమాలను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, నూకరాజు, ఎపిడి పద్మావతి, నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న గోవిందరావు తదితరులు

వివేకానందుని సూక్తులు మార్గదర్శకాలు

ప్రజాశక్తి- లీగల్ : వివేకానందుని సూక్తులు యువత అభివృద్ధికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని స్వామి వివేకానంద అడ్వకేట్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ పైడి గోవిందరావు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం వివేకానందుని జయంతి వారోత్సవాల ముగింపు నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధి విద్యాశంకర్ ఖండేల్వాల్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ, చికాగోలో ప్రపంచ ఆధ్యాత్మిక మహాసభలలో స్వామి వివేకానంద భారతదేశం తరపున హాజరై దేశ కీర్తి ప్రతిష్టను ఇనుమడింపచేలా చేసిన ప్రసంగం మరువలేనిదన్నారు. యువతకు ఇచ్చిన సందేశం ఎప్పటికీ ఆచరణీయం, సమాజ హితం అని చెప్పారు. వివేకానందుని సందేశం విద్యార్థులకు, వివిధ అణగారిన నిమ్న వర్గాల పిల్లలకు చేరే విధంగా ప్రణాళిక చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో హరిహరరెడ్డి, గోవిందరావు, వెంకటరావు, సుధీర్, కృష్ణ, యేసురత్నం, పెద్దినాయుడు పాల్గొన్నారు.

విశాఖ మార్కెట్లోకి న్యూ హుందాయ్ క్రెటా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఆటోమొబైల్ రంగంలో అతిపెద్ద ఆటోమొబైల్ డీలర్‌గా పేరుగాంచిన శ్రీ జయలక్ష్మి ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లక్ష్మీ హుందాయ్) ఆధ్వర్యంలో వినియోగదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న న్యూ హుందాయ్ క్రెటా వాహనం నగర మార్కెట్లోకి వచ్చేసింది. గురువారం ఉదయం రామా టాకీస్ వద్దగల తమ షోరూమ్‌లో లక్ష్మీ హుందాయ్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్) జి.కిషోర్ కుమార్‌ల సమక్షంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం పంకజ్ కుమార్ దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుందాయ్ సంస్థకు చెందిన క్రెటా వాహనం ఇప్పటికే ప్రజల అభిమానాన్ని, నమ్మకాన్ని చూరగొందని తెలిపారు. ఈ వాహనం అధునాతన మోడల్‌ను తాను విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం లక్ష్మీ హుందాయ్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన హుందాయ్ క్రెటా వాహనం అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం కలిగి వినియోగదారులకు సరికొత్త డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ఈ వాహనాలను కొనుగోలు చేసే వారికి అన్‌లిమిటెడ్ మైలేజ్ వారంటీ అందిస్తున్నామని చెప్పారు. ఈ వాహనాన్ని అధునాతన స్థాయి 2 ఎడిఎఎస్ సేఫ్టీ సూట్, శక్తివంతమైన 1.5 లీటర్ టర్బో జిడిఐ ఇంజిన్, యాక్టివ్ అండ్ పాసివ్ సేఫ్టీ ఫీచర్లు సహా సెగ్మెంట్ లీడింగ్ ఫీచర్లతో అందుబాటులోకి తెచ్చామని, ఈ న్యూ హుందాయ్ క్రెటా ప్రారంభ ధరను రూ.10,99,999గా నిర్ణయించామని తెలిపారు. ఈ వాహనం డీజిల్, పెట్రోల్ వేరియంట్లలో అందుబాటులో ఉందని, ఆసక్తిగల వినియోగదారులు తమ వెబ్‌సైట్ నందు రూ.25 వేలు అడ్వాన్స్ చెల్లించి వాహనాన్ని బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వాహనం కొనుగోలు చేసిన మొదటి వినియోగదారునికి ఎస్‌బిఐ డిజిఎం పంకజ్ కుమార్ చేతుల మీదుగా వాహనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

న్యూ హుందాయ్ క్రెటా తాళం చెవిని అందుకుంటున్న కొనుగోలుదారు

కోడికత్తితో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి- వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన దళిత యువకు బుర్ర తేజపై కోడి కత్తితో దాడి చేసి గాయపర్చిన అగ్ర కులానికి చెందిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పినపాత్రుని సాంబశివరావు డిమాండ్ చేశారు. వడ్డాది గ్రామంలో బాధితుడు తేజ కుటుంబాన్ని గురువారం చిరంజీవి, సాంబశివరావు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిసినా నేటికీ దళితులపై, మహిళలపై దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఇటువంటి ఘటనలు మరల జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడు తేజ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసుల్లో అరెస్టు అవుతున్న వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, దానిని రద్దు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బుసి కోటి తదితరులు పాల్గొన్నారు.

యువకులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ నేత చిరంజీవి తదితరులు

పట్టణ సిఐగా శంకరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి శంకర్రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ రూరల్ సిఐగా పని చేశారు. ఇక్కడ ఎంతవరకు సిఐగా పనిచేసిన దాడి మోహన్‌రావు శ్రీకాకుళం జిల్లా రాజాంకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శంకరరావు విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, అసాంఘిక కార్యక్రమాలు, నేర సంఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సచివాలయాల సిబ్బంది, సర్పంచులు, ఎంపిటీసీలకు స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో రెండు రోజులు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ లోగా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుపై సభ్యులకు వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అవసరాలను గుర్తించి ప్రణాళిక తయారు చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో ప్రసాద్, మండల రిసోర్స్ పర్సన్స్ సంతోష్ కుమార్, అప్పలరాజు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్రలోనే పేరుగాంచిన అనకాపల్లి వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు గురువారం ఘనంగా జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా 83వ కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ పాల్గొని ఊరేగింపును ప్రారంభించారు. ఈ నెల 22న జరిగే గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సారె ఊరేగింపు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాకాడ బాబు, ఉపాధ్యక్షులు ఎస్ నర్సింగరావు, కార్యదర్శి మద్దాల నూకరాజు, సహాయ కార్యదర్శి పసన శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్ తెలిపారు. ముందుగా వేల్పుల వీధిలో ఉన్న రామాలయం వద్ద మహిళలు తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శనగా ఉంచారు. అనంతరం వేల్పుల వీధిలోని పురవీధులలో ప్రదర్శన ఊరేగింపు నిర్వహించారు. మెయిన్ రోడ్డు, చిన్న నాలుగు రోడ్లు, నాలుగు రోడ్ల జంక్షన్ మీదుగా గౌరీ పరమేశ్వరుల ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. అనంతరం గౌరీ పరమేశ్వరుల ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు సారె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దోమరోతు రామారావు, నల్లల దేవుళ్ళు, ముత్తా ఈశ్వరరావు, గరికి వెంకట్రావు, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సారె ఊరేగిస్తున్న వేల్పుల వీధి వాసులు

దాడి ఘటనలో ఏడుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వడ్డాది సినిమా థియేటర్ వద్ద ఈనెల 16న బుర్ర దుర్గతేజపై దాడి చేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు తెలిపారు. గురువారం బుచ్చయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి భూపతి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు, దర్యాప్తు అనంతరం నిందితులపై ఐపిసి 307 హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు ఎ.శ్రీరామ్, కొరసాల గణేష్, వెలుగుల సాయికుమార్, మాకాల త్రినాథ్, గండం ప్రసాద్, వెలుగుల సురేంద్రలను కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గ్రామంలో వివాదాలకు ఆస్కారం లేకుండా ఇరువర్గాలతో శాంతికమిటీల ఏర్పాటుతోపాటు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కొత్తకోట సిఐ అప్పలనాయుడు, బుచ్చయ్యపేట ఎస్ఐ డి ఈశ్వరరావు ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి సుబ్బరాజు

రిపబ్లిక్ డే కవాతుకు అనిల్ కుమార్ ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విజయవాడలో జరిగే రిపబ్లిక్ డే క్యాంపునకు ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఎన్‌సిసి కేడెట్ జి.అనిల్ కుమార్ ఎంపికైనట్లు ఎన్‌సిసి అధికారి మణికంఠ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకల్ రిపబ్లిక్ డే క్యాంపు శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఏటికొప్పాక గ్రామానికి చెందిన అనిల్ కుమార్ ఈ నెల 26న విజయవాడలో జరిగే ముఖ్యమంత్రి కవాతులో పాల్గొంటాడని తెలిపారు. ఈ కవాతుకి విశాఖపట్టణం గ్రూపు నుండి పాల్గొంటున్న 12 మంది కేడెట్లలో అనిల్ కుమార్ ఒకడని వెల్లడించారు. గ్రామీణ ప్రాంత రైతు కుటుంబానికి చెందిన అనిల్ కుమార్ ఈ ఘనత సాధించడం పట్ల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్ అభినందనలు తెలిపారు.

వైసిపి నేతలను కలిసిన భరత్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అనకాపల్లి నియోజక వర్గ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్ కుమార్ గురువారం రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, శ్రీభోగలింగేశ్వర ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు తదితరులను వారి నివాసాలలో మర్యాద పూర్వకంగా కలిసారు. గత ఎన్నికల్లో మంత్రి అమర్‌నాథ్‌కు ఏ విధంగా కష్టి చేశారో అదే విధంగా తనను ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా శివ, నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సిపి పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి తాము చేసిన సేవలను గుర్తించి మంత్రి గుడివాడ అమర్ నాథ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా, బోగలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా పదవి యిచ్చి గౌరవించారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు, మంత్రి అమర్ నాథ్, ఎంపీ సత్యవతి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ గెలుపునకు ఎంతో దోహద పడతాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కుమార్ రాజా, బుద్ధ సత్య నారాయణ, భోగలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త వసుపల్లి తాతయ్యలు, వేగి త్రినాథ్, షేక్ జిలానీ, పెంటకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని మర్యాదపూర్వకంగా సత్కరిస్తున్న భరత్‌కుమార్

జిల్లాలో 13,994 మందికి వడ్డీ రాయితీ

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో 13,994 మంది గృహ లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల వడ్డీ రాయితీ ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహిళలకు చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేదవారి సొంతింటి కల సాకారమయ్యేందుకు ప్రభుత్వం జిల్లాలోని 1394 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అదనపు రుణంపై మొదటి విడత వడ్డీ రాయితీగా ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 43,904 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున రూ.154.67 కోట్ల మేర అదనపు రుణ సదుపాయం కల్పించడం జరిగిందని చెప్పారు. ఆ రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తదుపరి దశకు చెందిన ఇళ్ళ నిర్మాణ పురోగతి సాధించిన వారిలో ఇప్పటి వరకూ 13,994 మందికి రూ.1,33,67,055 మేర తొలి విడత వడ్డీ రాయితీ సొమ్ము ఆయా లబ్ధిదారుల ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు సొంత ఇంటి నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రభుత్వం అందచేస్తున్న ప్రోత్సాహం ద్వారా (ౕ ౕ ౕ ౕ ౕ ౕ ౕ) పొందచ్చున్నారు. ఈ సమావేశంలో ఎన్‌డిసి, గృహ నిర్మాణ శాఖ పిడి కె.రమామణి, డిఆర్‌డిఎ పి.డి. శచీదేవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

విశాఖ జిల్లాలో 14,872 మందికి..

విశాఖ కలెక్టరేట్ : నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా విశాఖ జిల్లాలో 14,872 మంది లబ్ధిదారులు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.90.18 లక్షలు లబ్ధిపొందినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీ రీయింబర్స్‌మెంట్ నిధులను బటన్ నొక్కి విడుదల చేయగా వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో విశాఖ నుంచి కలెక్టర్ మల్లికార్జున, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్‌పిటిసి సత్యం

ఘనంగా ముత్యమాంబ తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం ముత్యమాంబ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను జెడ్పిటిసి కర్రి సత్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు కర్రి సూరి నాయుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చింతల బుల్లి లక్ష్మి వెంకట రమణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున నిర్వాహకులు

పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి

గవరపాలెం ప్రసిద్ధి చెందిన శ్రీవినాయక గౌరీ సేవా సమితి పీలా వారి గౌరీ పరమేశ్వరుల సంక్రాంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం వద్ద ప్రతి ఏడాది వలె ఈ ఏడాది కూడా 300 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమర శెట్టివరాహ నూకరాజు, అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ధ బల్లమ్మ నాయుడు, కోశాధికారి బీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు మారిశెట్టి జగన్నాథరావు, జాయింట్ సెక్రెటరీ దాడి రామకృష్ణ, బుద్ధ శ్రీనివాసరావు, బీమరశెట్టి మహాలక్ష్మి నాయుడు, కొణతాల కృష్ణ, బుద్ధ శివ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయానికి మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని పంచ గ్రామాలైన హనుమాన్ నగర్ వద్ద నిర్మించిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయానికి పెదగంట్యాడ మండలం గంగవరం దిబ్బపాలెం గ్రామానికి చెందిన వాడమెదుల సింహాద్రి భారతి దంపతులు రూ.26 వేలు విలువైన మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈ మేరకు గురువారం తమ కుమారుడు జన్మదినం సందర్భంగా వాడమెదుల సింహాద్రి భారతి దంపతులు ఈ మైక్ సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాలం అప్పలనాయుడు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, ఈరుగుల లక్ష్మీప్రసాద్, కిలపర్తి అప్పలనాయుడు, కణితి చిన సోమేశ్వరరావు, సమ్మంగి చంటి తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేస్తున్న సింహాద్రి భారతి దంపతులు

20న రాస్తారోకోలను జయప్రదం చేయండి

కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి

తమ సమస్యలపై అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు పిలుపుమేరకు 20న జరుగు రాస్తారోకో కార్యక్రమాలను జయప్రతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, రైతు సంఘం జిల్లా నాయకులు కొరుబిల్లి శంకర్రావు మాట్లాడారు. గత 38 రోజులుగా అంగన్వాడీలు సమ్మెలో ఉన్నారని, వీరి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే జీతం పెంచేది లేదని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలు పెంచిందని, కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచిందని, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైందని అంగన్వాడీల పోరాటం మద్దతుగా అందరూ జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

చెరుకు బకాయిలు రైతుల ఖాతాల్లో జమ

ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు చెల్లించవలసిన బకాయిలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ ఆర్థిక స్థితిగతులు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు చెల్లించవలసిన 12 కోట్ల 30 లక్షల రూపాయలు గ్రాంట్ రూపంలో విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం సుగర్ ఫ్యాక్టరీకి రూ.80 కోట్లు వరకు ఆర్థిక సహాయం అందించిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో 140 కోట్ల రూపాయలు ఫ్యాక్టరీకి అప్పు ఉండేదని, ఈ నాలుగున్నరేళ్ల కాలంలో దానిని రూ.40 కోట్లకు తగ్గించినట్లు చెప్పారు. చెరుకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల పంట విస్తీర్ణం తగ్గుతుందని, రాష్ట్రంలో చాలావరకు చక్కెర కర్మాగారాలు మూత పడ్డాయని తెలిపారు. అయితే ప్రభుత్వం ఆదుకోవడంతో చోడవరం చక్కర కర్మాగారం ఒడిదుడుకులు ఎదురైనా నిలబడిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీని అభివృద్ధి చేయకపోతే 25 వేల రైతు కుటుంబాలతో పాటు దానిపై ఆధారపడ్డ మరో లక్ష మంది ఉపాధి దెబ్బతింటుందని తెలిపారు. అందుకే ఫ్యాక్టరీ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి గతంలో మాదిరిగా ఐదు లక్షల 50 వేల టన్నులు క్రషింగ్ జరిపించే విధంగా రూపకల్పన చేస్తున్నామని చెప్పారు.

ఎట్టకేలకు సుగర్స్ రైతులకు నగదు జమ

బుచ్చయ్యపేట : గత ఏడాది చోడవరం (గోవాడ) చక్కర కర్మాగారానికి చెరుకు సరఫరా చేసిన రైతులకు బకాయి నగదును ఎట్టకేలకు జమ చేశారు. 2022-23 సీజన్‌కు సంబంధించి టన్నుకు ఒక్కంటికి రూ.2500 చొప్పున గతంలో ఫ్యాక్టరీ చెల్లించగా, మిగిలిన రూ.321 బకాయి పెట్టింది. సంవత్సరం కాలంగా రైతులు ఈ నగదు కోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు బుధ, గురువారాల్లో రైతుల ఖాతాల్లో నగదు జమైంది. బకాయి సొమ్ము జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుండి 22 వరకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు, వడ్డాది

ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్ మహేంద్రనాథ్, వడ్డాది సబ్ స్టేషన్ ఎలక్ట్రికల్ ఏఈ సోమరాజు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సబ్బవరం నేషనల్ హైవే వద్ద కొత్తగా మూడు 132 కెవి టవర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ కారణంగా నాలుగు రోజులపాటు కె.కోటపాడు, వెంకన్నపాలెం, చోడవరం, బి.కింతాడ, దేవరాపల్లి, వారాడ, జన్నవరం, వడ్డాది, పోలేపల్లి, చీడికాడ, అప్పలరాజుపురం, మాడుగుల, రావికమతం, తదితర సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని వారు కోరారు.

అనకాపల్లి : పెందుర్తి-కసింకోట 132 కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తు, కొత్త లైన్లు ఏర్పాటు నేపథ్యంలో కసింకోట డివిజన్ పరిధిలోని కసింకోట, అల్లికానుడు పాలెం, వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న అనకాపల్లి మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని కొత్తూరు, తుమ్మపాల, రొంగలి వానిపాలెం, కుంచంగి, వేట జంగాల పాలెం, కూండ్రం, పిసిని కాడ, సంపతిపురం, వెంకుపాలెం, విస్సన్నపేట, మూలపేట, సత్యనారాయణపురం, బౌలువాడ, మామిడిపాలెం, గురన్నపాలెం, మార్టూరు మాకవరం మొండిపాలెం, పాపయ్య పాలెం పాపయ్య సంతపాలెం కొండ పాలెం, చేనుల అగ్రహారం, సుందరయ్య పేట అచ్చయ్య పేట, మొండిపాలెం, సీతానగరం వెంకుపాలెం తగరంపూడి, గదభపేట, మెట్టపాలెం జగన్నాథపురం దిబ్బపాలెం, ఊడేరు, అల్లికానుడి పాలెం గ్రామాల్లోని గృహ, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండల కేంద్రంలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.... దేవరాపల్లికి చెందిన బొబ్బిలి దేవుళ ళ్ (33) ద్విచక్ర వాహనంపై పెట్రోల్ కోసం విశాఖ రోడ్డు వైపు వెళుతుండగా కైరలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి వస్తున్న ట్రాక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన దేవుళ్లును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ ప్రధాన చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కె.కొటపాడు సిహెచ్‌సికి 108లో తరలించారు. ఈ ప్రమాదంపై దేవుళ్ళు భార్య దేవి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

అలాగే మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద గురువారం మధ్యాహ్నం స్థానిక వ్యాపారవేత్త వెచ్చ రమేష్ (55) బంకులో పెట్రోల్ కొట్టించుకొని వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తున్న రమేష్ ను ఢీ కొట్టి పరారయ్యాడు. రమేష్ కాలుకు బలమైన గాయం తగలడంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఐ ఉద్యోగానికి రవికుమార్ అర్హత

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం, అచ్చర్ల గ్రామానికి చెందిన బొడ్డేట రవికుమార్ (24) ఇటీవల జరిగిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు జరిగిన పరీక్షల్లో 14వ ర్యాంకు సాధించి ఎస్ఐ పోస్టుకు అర్హత సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రవికుమార్ తమ స్వగ్రామం అచ్చర్లలో 1 నుండి 7వ తరగతి వరకు తాళ్లపాలెం జెడ్పి హైస్కూల్‌లో 8, 9, 10 తరగతులు, అనకాపల్లిలో ఇంటర్మీడియట్ చదివారు. అనంతరం ఏలూరులో ప్రైవేటుగా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. రవికుమార్ కబడ్డీ క్రీడాకారుడు. ముంబయి, చెన్నై, ఆంధ్రప్రదేశ్ జరిగిన పలు మ్యాచ్‌లో గెలుపొందారు. కుమారుడు ఎస్ఐగా ఎంపిక కావడం పట్ల రవికుమార్ తల్లిదండ్రులు గంగరాజు, మాణిక్యం ఆనందం వ్యక్తం చేశారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - కశింకోట

గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కశింకోట సిఐ వినోద్‌బాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తీర్థాలు ఉత్సవాలు పేరుతో కోడిపందేలు, ఇతర జూద క్రీడలకు ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కశింకోట జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. ఇతర గ్రామాలకు పట్టణాలకు వెళ్లే వాసులు ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని, దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చట్ట విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని సీఐ వినోద్ బాబు సూచించారు.

భూకబ్జాలు పెచ్చుమీరుతున్నాయి : బండారు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని భూకబ్జాలు పెచ్చుమీరి పోతున్నాయని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సబ్బవరం తహసిల్దార్ భూకబ్జాదారులకు కొమ్ముకాస్తూ సహకరిస్తున్నారని ఆరోపించారు. కోట్లాది విలువైన భూములు కబ్జాలకు గురవుతున్నాయన్నారు. తహసిల్దార్ వచ్చే నెలలో పదవి విరమణ చేసి వెళ్లిపోయినా, టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత భూకబ్జాలపై తగిన దర్యాప్తు చేయించి తహసిల్దార్‌కు రావలసిన జీతభత్యాలను నిలిపివేస్తానని హెచ్చరించారు. మండలంలోని కోట్లాది రూపాయలు విలువచేసే భూములు కబ్జాలు చేస్తున్నా రెవిన్యూ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సామాజిక సమతా సంకల్ప మహోత్సవ మారథాన్

ప్రజాశక్తి- అనకాపల్లి : సామాజిక సమతా సంకల్ప మహోత్సవాలలో భాగంగా గురువారం అనకాపల్లిలో జాతీయ రహదారి పూడిమడక రోడ్డు జంక్షన్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నెహ్రూ చౌక్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి సామాజిక సమతా సంకల్ప మహెూత్సవాలను గూర్చి, బాబాసాహెబ్ బిఆర్. అంబేద్కర్ గొప్పతనం గురించి వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజుల వాణి, డిఆర్‌డిఏ పిడి శచీదేవి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, సాంఘిక సంక్షేమ శాఖ ఏడి అజయ్ బాబు, డిఎస్‌డిఓ ఎల్వి రమణ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై..

ప్రజాప్రతినిధులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఉపాధి, వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ అంబేద్కర్, ఏవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ నానాజీ మాట్లాడారు. గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అంశాలతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో అవసరమైన అంశాలను కూడా ప్రణాళికలో పొందుపరచాలన్నారు. వార్షిక ప్రణాళికల తయారీలో భాగంగా నిర్వహించే గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించడానికి ప్రాంతాల వారీగా ప్రజాప్రతినిధులతో పాటు, స్థానిక ప్రజల భాగస్వామ్యం చేయాలన్నారు.

నక్కపల్లిలో శిక్షణ ఇస్తున్న అధికారులు

నర్సీపట్నంటౌన్:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా తరగతులు ఎంపీడీవో జయ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో జయ మాధవి మాట్లాడుతూ, 15వ ఫైనాన్స్ నిధులు ఏ విధంగా ఖర్చు పెట్టాలో ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని

నర్సీపట్నంలో మాట్లాడుతున్న జయమాధవి

తెలిపారు.గ్రామ సభల నిర్వహించి గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ప్రణాళికను సిద్ధం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఈఓపిఆర్‌డి భానుజీరావు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ అభివృద్ధికి నిధుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య, తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధాన సమస్యలు గుర్తించాలని ఆయా శాఖల అధికారులకు తెలియజేయాలన్నారు. మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కూరగాయలకు కేరాఫ్ కసిరెడ్డిపాలెం

-వివాహాది కార్యక్రమాలకు ఇక్కడే కొనుగోలు - ప్రోత్సాహకాలు అందించని ప్రభుత్వం

కాలీఫ్లవర్ సాగు చేపడుతున్న మహిళ

దుక్కుదున్నుతున్న రైతులు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:కూరగాయల సాగుకు నర్సీపట్నం మండలం కసిరెడ్డిపాలెం ప్రసిద్ధి గాంచింది. ఈ ప్రాంత రైతులు ముఖ్య పంటలు కాలీఫ్లవర్‌తో పాటు టమాటా, వంకాయ, పచ్చిమిరప, కొత్తిమీర తదితర రకాలకు చెందిన వాటిని అధికంగా సాగు చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్లో కూరగాయలు కావాలంటే సుదూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేయడంతో రైతులు ఆదాయాన్ని పొందుతున్నారు. వినియోగదారులకు తాజా కూరగాయలతో పాటు స్థానికంగా పెరిగిన ఉత్పత్తులను అందిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాల పంపిణీ, సబ్సిడీపై ఎరువుల అందించడం, ప్రోత్సాహకాలు అందిస్తే ఖర్చులు తగ్గుతాయని రైతులు తెలిపారు. మార్కెట్లలో కూరగాయల ధరలు మండి పోతున్నాయి. పచ్చిమిరప, బెండ కాయ, కాకరకాయ తదితర రకాల కూరగాయల ధరలు గత కొన్ని నెలలుగా కొండెక్కి కూర్చున్నాయి. ఇటువంటి సమయంలో ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తే ఇంకా విస్తృతంగా పండించే అవకాశాలు ఉన్నాయి.

కొత్తిమీర తోట

పెరిగిన ఖర్చులతో ఆర్థిక భారం

దుక్కులు దున్ని, నారు పోసిన దగ్గర్నుంచి ఎరువులు చల్లడం, మూడుసార్లు గొప్పులు తవ్వడం వంటి వాటికి అధికంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. తమకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తే అధికంగా ఆదాయం పొందవచ్చు. పెట్టుబడులు అధికమై లాభాలు తగ్గుతున్నాయి. ప్రభుత్వం నుండి సబ్సిడీపై విత్తనాలు ఎరువులు అందించి నట్లయితే బాగుం టుంది.

టి.రాములమ్మ
రైతు కసిరెడ్డి పాలెం

తెగుళ్లు, కోతుల బెడదతో నష్టం

మా ప్రాంతంలో గతంలో అధికంగా కాయగూరల పంటలు పండించేవారం. ప్రస్తుతం తెగుళ్ళ, కోతుల బెడద ఎక్కువవడంతో పంటలు తగ్గించాము. కోతుల బెడద నుండి అధికారులు కాపాడితే పంటలు పండించే అవకాశం ఎక్కువగా ఉంది. అలాగే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలని కోరుతున్నాం.

బర్ల సూరిబాబు
కసిరెడ్డి పాలెం

అధికారులు, ప్రభుత్వం సహకరించాలి

మా ప్రాంతంలో వ్యవసాయ ముఖ్య అధికారులు పర్యవేక్షించి మట్టి నమూనాలను సేకరించి అందుకు తగినటువంటి పంటలు వేసేందుకు సూచనలు సలహాలు ఇవ్వాలి.నిత్యం వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఉన్నట్లయితే తమకు ఎంతో ప్రోత్సాహంగా ఉంటుంది. తాను గ్రాడ్యుయేట్ పూర్తి చేసినప్పటికీ కూరగాయల పంటలు పండించేందుకు చదువును ఆపివేయడం జరిగింది. అధికారుల ప్రోత్సాహకాలు, ప్రభుత్వం సహాయాలు మరింతగా అందినట్లయితే కాయగూరలు పండించేందుకు రైతులు ముందుకు వస్తారు.

తమరాన రాము
కసిరెడ్డిపాలెం రైతు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నర్సీపట్నం: ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ వూషూ ఛాంపియన్షిప్ పోటీల్లో నర్సీపట్నం నుండి ఏడుగురు వూషు ఫైటర్స్ పాల్గొంటున్నారని జడ్పీ హైస్కూల్ క్రీడా అధ్యాపకులు దేవి తెలిపారు. ఈనెల 19 నుండి 22 వరకు తమిళనాడులో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున రాజరాజేశ్వరి, శర్వాణి, శరణ్య, నివేదిత, బిందు, శ్రీదివ్య, హారిక, అంకిత పాల్గొంటున్నారని పేర్కొన్నారు.సబ్ జూనియర్, జూనియర్ బాలికల కేటగిరిలో చెట్టుపల్లి జడ్పీ హై స్కూల్‌కి చెందిన ముగ్గురు బాలికలు ప్రతి రోజూ నర్సీపట్నంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహరావు, నింజాస్ అకాడమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు బోలెం శివ, వూషు సీనియర్ కోచ్ యర్రా శేఖర్ అభినందించారు.

కుల గణనపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:కుల గణనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని దళిత సేవా పరిరక్షణ (డిఎస్‌పి) జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు తెలిపారు. గురువారం దాసు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ సిహెచ్ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నంలో కుల గణన చేపట్టే ముందు క్షేత్రస్థాయిలో కనీసం అవగాహన కల్పించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యమ్.అప్పలరాజు, డిఎస్‌పి మండల నాయకులు మద్రా చిన్ని పాల్గొన్నారు.

గెలుపొందిన రావికమతం జట్టు

మండల స్థాయి క్రికెట్ పోటీల్లో

రావికమతం జట్టు విజయం

ప్రజాశక్తి -రావికమతం:ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ ఉత్సాహంగా ముగిసింది. మండలంలో 24 సచివాలయాల పరిధిలో జరిగిన క్రికెట్ పోటీలు మండల స్థాయిలో ఫైనల్‌కు కొత్తకోట సచివాలయం, రావికమతం సచివాలయం టీములు తలపడ్డాయి. మొదటగా బ్యాటింగ్ చేసిన కొత్తకోట 8 ఓవర్స్ ముగిసే సమయానికి 33 రన్స్ చేశారు. రావికమతం సచివాలయం 34 రన్స్ చేసి విజయం సాధించింది. దీంతో జోనల్ స్థాయికి అర్హత సాధించారు.

ఇద్దరు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -పాడేరు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని ఈదులపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. పి.హెచ్.సి. వైద్యాధికారులు ఇద్దరు విధులకు హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు శ్రీను, ఎం.నరసింహలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఓపి రిజిస్టరును తనిఖీ చేశారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. పి.హెచ్.సి పరిధిలో ఉన్న గర్భవతులు ఎంతమంది ఉన్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భవతులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగా ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం జరిగేలా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

నేటి నుంచి జిల్లాలో కుల గణన

-ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

- విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి- కలెక్టరేట్: కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి కుల గణన ప్రక్రియను ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లా పరిధిలో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ,వార్డు సచివాలయ స్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక మొబైల్ యాప్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. ఇది వరకే ఈ సర్వేపై వివిధ వర్గాల ప్రజలు, ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించామని గుర్తు చేశారు. జోనల్, మండల, సచివాలయ స్థాయిలో సిబ్బంది అందరికీ ఈ సర్వే పై సమగ్ర శిక్షణ కూడా అందించినట్లు వివరించారు.వివిధ కారణాలతో సర్వే వాయిదా పడిందని, శుక్రవారం నుంచి జిల్లాలో జరుగుతుందని వెల్లడించారు. సర్వేలో భాగంగా వివరాలు సేకరించే సిబ్బందికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాల అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

కులగణన షెడ్యూల్ ఇలా..

జనవరి 19 - 28 ఇంటింటి సర్వే

జనవరి 29- ఫిబ్రవరి 2 వరకు మిగిలిపోయిన ఇళ్లు, వ్యక్తుల వివరాల సేకరణ

ఫిబ్రవరి 15 వరకు సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ ఇతర ప్రక్రియలు.

ఎన్ఎంయుఎ రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- కలెక్టరేట్:ఆర్టిసి విశాఖపట్నం రీజియన్ లో 1/2019 సర్క్యులర్ ను తక్షణం అమలు చేయాలనే డిమాండ్ తో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఎ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. ప్రధానంగా 1/2019 సర్కులర్ అమలు చేయాలని, ఎఎఎస్‌లు ఇవ్వాలని, అన్ని కేటగిరి ఖాళీలు భర్తీ, వెహికల్ కండిషన్ మెరుగు, స్పేర్స్ అండ్ టూల్స్, బలవంతంగా డ్రైవర్లకు టీమ్ ఇచ్చే విధానం విడనాడాలని ఎన్ఎంయుఎ నేతలు నినాదాలు చేశారు. అనారోగ్యంతో సిక్ అయిన వారికి జీతాలు ఇవ్వాలని, విద్యార్థులకు, ప్రజలకు సరిపడా బస్సులు వేయకపోగా ఉన్న బస్సులను రద్దు చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. అక్రమ ట్రాన్స్ ఫర్ లను నిలుపుదల చేసి, బస్సులకు సరిపడా రన్నింగ్ టైమ్ ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరరావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుఎ రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్ మూర్తి, రీజనల్ కార్యదర్శి బి.నీలకంఠం, అధ్యక్షులు జి. రామకృష్ణ, డివిజనల్ సెక్రటరీ ఎ.కె శివాజీ, గాజువాక డిపో అధ్యక్ష కార్యదర్శులు పి.శంకరరావు,ఎన్.సంజీవ్, వాల్తేర్ డిపో అధ్యక్షులు పి.జి.పతి, మద్దిలపాలెం డిపో అధ్యక్షులు ఎం. ఈశ్వరరావు, సింహాచలం డిపో అధ్యక్షులు నాయుడు, గ్యారేజి కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

నేడు పాడేరులో స్పందన

ప్రజాశక్తి-పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో ఈనెల 19న శుక్రవారం యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు లో జరగనున్న స్పందనకు ప్రజలు హాజరై వారి సమస్యలను అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

వైస్ ఎంపిపికి మాతృ వియోగం

హుకుంపేట: మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు తల్లి లచ్చమ్మ(58) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలను మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకిన వలసలో జరుగుతాయని కుటుంబ సభ్యులు మజ్జి చిట్టిబాబు తెలిపారు. కుటుంబం సభ్యులను సీపీఎం, సీఐటీయూ గిరిజన సంఘ నేతలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

షోకాజ్ నోటీసులపై నిరసనలు

- కొనసాగిన అంగన్వాడీల ఆందోళనలు

నక్కపల్లిలో నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో నిరసనలు కొనసాగించారు. షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై నినాదాలు చేశారు. పలు చోట్ల వినూత్నంగా ఆందోళనలు కొనసాగించారు.

కె.కోటపాడు : అంగన్వాడీలు సమ్మె చేస్తున్న సందర్భంగా ప్రభుత్వం వారికి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు రాతపూర్వకంగా సమాధానం తెలుపుతూ గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్

దేవరాపల్లిలో..

నాయకులు జి.కుమారి, పి.భవానీ, కెవిపిఎస్ జిల్లా నాయకులు గాడి ప్రసాదు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నక్కపల్లి:తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె గురువారం నాటికి 38వ రోజుకు చేరింది. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగనవాడి వర్కర్స్ ఆందోళన చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు ఎలమంచిలి బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు తళ్ళ సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మి రాజ్యం, మంగలక్ష్మి, రమణమ్మ, జయ, ఆర్వి కె.లక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక ఎన్టిఆర్ స్టేడియంలో అంగన్వాడీలు గురువారం 38వ రోజు సమ్మె కొనసాగించారు. ప్రాజెక్ట్ నాయకురాలు వి.సామ్రాజ్యం

పరవాడలో..

మాట్లాడుతూ, కనీసవేతనాలు, గ్రాడ్యూటీ, పిఎఫ్ ఈఎస్ఐలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె తిరుమూర్తిలరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ప్రాజెక్టు నాయకులు డి.మహలక్ష్మీ, మరణమ్మ పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన చేపట్టారు. తమ న్యాయమైన సమస్యలు నెరవేర్చాలంటూ

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన నిరసనలు

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్వాడీల 38వ రోజు మోకాళ్ళపై నిలబడి జగన్మోహన్ రెడ్డికి దండం పెడుతూ నిరసన తెలిపారు. వీరికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీదేవి మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి సత్యనారాయణ, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ

పెందుర్తిలో...

నాయకులు సిహెచ్ దేవి, ఎం రమణి,ఎస్ పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీల చేస్తున్న నిరసన 38వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. దేముడునాయుడు, యూనియన్ నాయకులు మంగ, సుజాత, నూకరత్నం, లక్ష్మి, అమ్మజి పాల్గొన్నారు.

అనకాపల్లి : అంగన్వాడీలు స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో అంగన్వాడీలు 38వ రోజు నిరసన కొనసాగింది. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగశేషు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

దేవరాపల్లి : అంగనవాడీలు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు డి.వెంకన్న, బిటి దొర, అంగన్వాడీలు జి.వరలక్ష్మి, పి. కన్నతల్లి, సన్యాసమ్మ, కె.కోమలి, చెల్లయ్యమ్మ, జయ, రమణమ్మ పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సమ్మె 38వ రోజుకు చేరుకున్న సందర్భంగా 38వ అంకె రూపంలో కూర్చుని పెద్దపెట్టున నినాదాలు చేశారు. వారికి మద్దతు తెలుపుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీల పోరాటం స్ఫూర్తిదాయకమైందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్ష సాధింపు, బెదిరింపు చర్యలు మానుకుని వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి యువ నాయకులు ఆడారి కిషోర్ కుమార్ సంఘీభావం తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా నాయకులు వై.తులసి, ఎఐటియుసి అనుబంధ

కోటవురట్లలో..

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్యామలదేవి, కార్యదర్శి గుడివాడ అరుణ, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి పి.లక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : ప్రభుత్వం జారీ చేసిన జిఒ 2 నోటీసులను ప్రదర్శిస్తూ అంగన్‌వాడీలు గురువారం భీమిలిలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీచ్ రోడ్డులోని శాఖా గ్రంథాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ చిన్న బజారు మీదుగా కృష్ణా కాలనీలో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు చేరింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, అధ్యక్ష కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, వివిధ సెక్టార్ల లీడర్లు కోమలి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మె శిబిరాన్ని ఐద్వా నాయకులు అనంతలక్ష్మి, పౌర సంఘం నాయకులు ఇందిరా, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మౌలాలి సందర్శించి సంఘీభావం తెలిపారు. మౌలాలి పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, దేవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...